క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

పరిశీలించిన ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



కాలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దౌల్తాబాద్(దుబ్బాక): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన పబ్బ అశోక్‌గుప్తా ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అయితే కుటుంబ సభ్యులు ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఇంట్లో విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయని బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ బక్కి వెంకటయ్య అశోక్ కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. వారి వెంట నియోజక సమన్వయకర్త రణం శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రహీమొద్దీన్, చైర్మన్ శ్రీనివాస్, నరసింహారెడ్డి, యాదగిరి, జనార్దన్‌రెడ్డి, ఆంజనేయులు, నాగరాజు, స్వామి తదితరులు ఉన్నారు.

వైభవంగా వార్షికోత్సవాలు



పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు, రుత్విక్‌లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని సంతోషిమాత ఆలయ 33వ వార్షికోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో సోమవారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, కుంకుమపూజలు, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనం, అన్నప్రసాదం అందజేశారు. మంగళవారం సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు. వార్షికోత్సవాల నిర్వహణలో ఆలయ మాజీ చైర్మన్ డాక్టర్ మాంకాల నవీన్‌కుమార్, మాజీ ధర్మకర్త గాధగోని సత్యం గౌడ్, కార్యనిర్వహణాధికారి శ్రీధర్‌రెడ్డి, తమ్మిశెట్టి వీరేశం, కాశం కాశీనాథ్ పాల్గొన్నారు.

భవనాలు నిర్మించరూ..?

హుస్నాబాద్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించి మెరుగైన వసతులు కల్పించాలని ఏబీవీపీ నాయకులు సోమవారం తహసీల్దార్ లక్ష్మారెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని వసతి గృహాలు ఎన్నో యేళ్లుగా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వ బీసీ సంక్షేమ హాస్టల్ భవనంపై కప్పు పెచ్చులు ఊడి పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, గిరిజన మహిళా హాస్టల్‌కు ప్రహరీ నిర్మించి వాచ్‌మెన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి చరణ్, నాయకులు రాహుల్, అంజి, రాజేశ్ పాల్గొన్నారు.

కుంటశిఖం ఆక్రమణపై నిరసన



కుంటశిఖం పరిశీలిస్తున్న అధికారులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని సముద్రాల గ్రామంలో గాండ్లవారి కుంటను కొందరు ఆక్రమించుకొని చదును చేయగా అఖిలపక్ష నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని వారితో మాట్లాడారు. కుంట శిఖాన్ని పరిశీలించారు. కొంత ఆక్రమణకు గురైందని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో నాయకులు ఆందోళన విరమించారు.

బేస్‌మెంట్ పూర్తిచేస్తే రూ.లక్ష మంజూరు



ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాలయ్య

దుబ్బాకటౌన్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు బేస్‌మెట్ వరకు నిర్మాణం పూర్తి చేసిన వారికి వెంటనే రూ.లక్ష బిల్లు మంజూరు చేస్తారని రాయపోల్ ఎంపీడీఓ బాలయ్య చెప్పారు. మండలంలోని టింకంపేటలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని, సకాలంలో ఇండ్ల నిర్మాణం పూర్తిచేసి బిల్లులు పొందాలని సూచించారు. ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శశికుమార్ ఉన్నారు.

శిథిల భవనంలోనే విధులు

కూలడానికి సిద్ధంగా పంచాయతీ కట్టడం

- భయం గుప్పెట్లో అధికారులు
- వేరేచోటుకు మార్చాలని విన్నపం

సుమారు యాభై యేళ్ల కిందట నిర్మించిన స్కూల్ భవనంలో ఆ పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది. పూర్తిగా శిథిలావస్థకు చేరుకొంది. ఎప్పుడు కూలుతుందోననే భయం మధ్య పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనం



పెచ్చులూడుతున్న స్లాబ్



వర్షపునీరు కారుతున్న గోడలు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం మైసమ్మవాగుతండా పంచాయతీగా ఏర్పాటైనప్పటి నుంచి పురాతన పాఠశాల భవనంలోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. నిత్యం స్లాబు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. అలాగే విష సర్పాలు, పురుగులు యథేచ్ఛగా లోనికి వస్తున్నాయి. సరైన కిటికీలు, తలుపులు కూడా లేవు. వర్షాలు కురిస్తే గోడలు, పైకప్పు నుంచి నీరు కారుతోంది. దీంతో నిత్యం భయభయంగా విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి నెలకొందని పంచాయతీ అధికారులు, సిబ్బంది వాపోతున్నారు.

గత్యంతరం లేదు..

ఈ భవనాన్ని వెంటనే కూల్చివేయాలని ఇటీవల పంచాయతీరాజ్ అధికారులు నివేదిక ఇచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. అయినా గత్యంతరం లేక పాత భవనంలోనే ఉండవల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు.

స్థల వివాదం

నూతన భవన నిర్మాణానికి గత ప్రభుత్వం హయాంలో రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది. అయితే స్థల వివాదంతో నిర్మాణం వాయిదా పడింది. ప్రస్తుతం సర్పంచ్ పదవీకాలం ముగిసిపోవడంతో గ్రామ ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పాలకవర్గాల నియామకం జరిగితేనే జీపీ భవనాల నిర్మాణానికి అడుగుపడేట్టు లేదని అధికారులు వాపోతున్నారు.

ప్రమాదం జరగక ముందే..

ఈ శిథిల భవనం వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే తాత్కాలికంగానైనా వేరే భవనంలోకి మార్చాలని, భయభయంతో విధులు నిర్వర్తించలేకపోతున్నామని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సీఎం ఫొటో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

చైర్మన్ చాంబర్‌లో సీఎం ఫొటో!

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలైనా బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో సీఎం ఫొటో లేదని కాంగ్రెస్ కౌన్సిలర్లు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఏర్పాటు చేశారు. దీంతో రెండు పార్టీల నేతల మధ్య వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ కౌన్సిలర్లు శ్రీదేవి, పూర్ణిమ, రియాజ్, కవిత, బాల్‌లక్ష్మి మాట్లాడుతూ నెలలు గడిచినా చాంబర్‌లో సీఎం ఫొటో పెట్టకపోవడం సిగ్గుచేటన్నారు.

– సిద్దిపేటజోన్

గాలి ఆరోపణలు చేయొద్దు

- అవినీతిని ఉపేక్షించేది లేదు
- అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు వద్ద
- మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్



మాట్లాడుతున్న చైర్మన్ మంజుల, వైస్ చైర్మన్ కనకరాజు

సిద్దిపేటజోన్: జాతీయ, రాష్ట్రస్థాయిలో పేరు ప్రఖ్యాతులు కలిగిన సిద్దిపేట మున్సిపాలిటీలో అవినీతి అంటూ గాలి ఆరోపణలు చేయొద్దని, సంబంధించిన సాక్ష్యాధారాలు ఉంటేనే ఆరోపించాలని మున్సిపల్ చైర్మన్ మంజుల, వైస్ చైర్మన్ కనకరాజు అన్నారు. ఇటీవల కొందరు కౌన్సిలర్లు మున్సిపాలిటీలో అవినీతి జరిగిందంటూ ఆరోపిస్తున్న నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కృషితో సిద్దిపేట అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్‌లో చేరిన కొందరు కౌన్సిలర్లు ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారి వద్ద ఆధారాలుంటే ఉన్నతాధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. సిద్దిపేట ప్రతిష్టకు భంగం కలిగించేలా ఆరోపణలు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులను ఉపేక్షించేది లేదని చెప్పారు. పదినెలల్లో వివిధ పన్నుల రూపంలో అదనంగా రూ.5 కోట్ల ఆదాయం మున్సిపల్ ఖజానాకు వచ్చిందని, కొందరు కౌన్సిలర్లు ఇష్టానుసారంగా ఆరోపించడం సరికాదన్నారు. నిబంధనలు అతిక్రమించి అవినీతికి పాల్పడే అధికారులను వదిలిపెట్టేది లేదని, వారిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానంచేసి ప్రభుత్వానికి అందిస్తామని చెప్పారు. కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు మున్సిపల్ అభివృద్ధి కోసం జిల్లా మంత్రి ద్వారా నిధులు తేవాలని సూచించారు. రాజకీయ ఒత్తిడి ద్వారా మున్సిపల్ అధికారులు, ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేయొద్దని చెప్పారు. త్వరలో మున్సిపాలిటీలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేస్తామని, అవినీతికి సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు ఆ బాక్స్‌లో వేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పవిత్రోత్సవాలకు ఘనంగా అంకురార్పణ



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో సోమవారం రాత్రి పవిత్రోత్సవాలకు అంకురార్పణ జరిగింది. పాంచరాత్ర ఆగమ విధానంలో విష్వక్సేనుల సాక్షిగా ఆలయ చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా, ఈఓ విజయరామారావు, ఆలయ ప్రధాన అర్చకుడు జగన్నాథాచార్యులు, ధర్మకర్తలు కిష్టయ్య, ఉషశ్రీ, శేఖర్, శ్రీనివాస్, అర్చక వేదపండిత, ఆలయ సిబ్బంది, భక్తజన పరివారం మేళతాళాల మధ్య ఊరేగింపుగా ఈరబాయమ్మ తోటకు వెళ్లి పుట్టమన్ను తెచ్చారు. ఆలయ ప్రధాన మండపంలో వేదికపై విశేషాలంకృతులై స్వామివారు కొలువుదీరగా, అర్చకులు రక్షాబంధనం, అంకురార్పణ, నివేదన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘటనలు పునరావృతం కావొద్దు: బీఆర్ఎస్వీ నేతలు



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చిన్నకోదూరు(సిద్దిపేట): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల ల్యాబ్‌లో రసాయనాలు పడి ఇంటర్ మొదటి సంవత్సరం ఇద్దరు విద్యార్థినులకు గాయాలు కావడంతో బీఆర్ఎస్వీ నాయకులు సోమవారం కళాశాలను సందర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ల్యాబ్‌లో ప్రాక్టికల్స్ చేసే సమయంలో అధ్యాపకులు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, శ్రావణ్, భానుచందర్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండో రోజు అదే జోరు



కాంస్య పతకం సాధించిన క్రీడాకారులు

సిద్దిపేటజోన్: హన్మకొండలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ టోర్నీలో రెండో రోజు సోమవారం సిద్దిపేట జిల్లా పతకాలను సొంతం చేసుకుంది. అండర్ 18 విభాగంలో ఉదయ్ హై జంప్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. అదేవిధంగా అండర్ 20 విభాగంలో డెకథాన్ అంశంలో హబీబ్(స్వర్ణ), లీలానంద్(రజతం), జావెలిన్ త్రోలో నగేష్(రజతం), హై జంప్‌లో సాగర్(కాంస్య), రిలే పరుగులో(కాంస్య) పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వారిని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ వెంకట్ స్వామి అభినందించారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

మండల వ్యవసాయ అధికారి నరేశ్



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నరేశ్

దుబ్బాకటౌన్: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పత్తి పంటను రక్షించుకోవడానికి రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రాయపోల్ మండల వ్యవసాయాధికారి నరేశ్ సూచించారు. చిన్నమాసాన్ పల్లిలో సోమవారం ఆయన పత్తి సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం పత్తిపంటలో రసంపీల్చే పురుగులు ఆశించే అవకాశం ఉందని, నివారణ కోసం ఎకరానికి అసిటామిప్రిడ్ 20 శాతం, ఎస్పీ 100 గ్రాములు లేదా ఫిప్రొనిల్ 400మీ.లి, థయోమిథాక్జామ్ 25 శాతం, డబ్ల్యూజీ 100 గ్రాములు, వేప నూనె వెయ్యి మీ.లీ కలిపి పిచికారీ చేయాలన్నారు. దీని వల్ల పత్తిలో తెల్లదోమ, పచ్చదోమ, పెనుబంక లాంటి రసం పీల్చే పురుగులను నివారించి మంచి ఫలితం పొందవచ్చని చెప్పారు. నానో యూరియా ప్లస్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారి కవిత, రైతులు ఉన్నారు.

అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తాం

మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

గజ్వేల్: నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. మంత్రి వివేక్ ఆదివారం హాజరైన రేషన్‌కార్డుల పంపిణీ రసాభాసగా మారిన ఘటన నేపథ్యంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు వస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు నాయిని యాదగిరి రచ్చచేస్తున్నారన్నారు. ఈ ఇద్దరితోపాటు మరికొందరు కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగిస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలోని మండలానికి ఇద్దరు ముగ్గురిని పోగుచేసి పార్టీలో గొడవలు చేయడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, జిల్లా మైనార్టీ సెల్ నాయకుడు సమీర్, నాయకులు రేగొండ, రాములుగౌడ్, మాజీ ఎంపీటీసీ అంజి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

రాష్ట్ర డీలిమిటేషన్ కమిటీ సభ్యుడు శ్రావణ్ కుమార్‌రెడ్డి



సత్యనారాయణస్వామి సన్నిధిలో శ్రావణ్‌రెడ్డి తదితరులు

దౌల్తాబాద్(దుబ్బాక): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కృషిచేయాలని రాష్ట్ర డీలిమిటేషన్ కమిటీ సభ్యుడు పన్యాల శ్రావణ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కష్టపడే కార్యకర్తలకు పార్టీ భరోసా ఇస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం నిరుపేదలకు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త మీద ఉందన్నారు. అనంతరం సత్యనారాయణస్వామి దేవాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, బాలకృష్ణ, స్వామి, దశరథ్‌రెడ్డి, నరసింహారెడ్డి, బుచ్చిరెడ్డి, కృష్ణ, లక్ష్మయ్య, సందీప్, నర్సింహులు, రాజిరెడ్డి, శ్రీకాంత్, కృష్ణ, ఎల్లం, అండాలు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలతో అప్రమత్తం

ఎస్‌ఐ రాజు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రాజు

కొమురవెల్లి(సిద్దిపేట): అవసరం ఉంటే తప్ప సోషల్ మీడియాను వాడవద్దని, సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రాజు సూచించారు. మండలంలోని గురువన్నపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం షీ టీంతో కలసి చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు, ఈవ్ టీజింగ్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దన్నారు. ఇష్టపడి చదివితే తప్పకుండా జీవితంలో స్థిరపడతారని చెప్పారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ఉపాధ్యాయులకు తెలపాలని సూచించారు. కార్యక్రమలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఖాజీపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. భూంపల్లి ఎస్‌ఐ హరీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తక్కల రాజు(42) కొన్న రోజులుగా ఖాళీగా తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో అతడి భార్య రాణి మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన రాజు ఒకటో తేదీన గుర్తు తెలియని పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

◆ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

అక్కన్నపేట(హుస్నాబాద్): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరైన లబ్ధిదారులతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. మండలంలోని కన్నారంలో సోమవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. సకాలంలో ఇళ్లు పూర్తి చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సాయం పొందాలని కోరారు. కార్యక్రమంలో శివయ్య, ముకుందరెడ్డి, ఎల్లయ్య, ఎంపీడీఓ జయరాం, ఎంపీఓ మోహన్‌నాయక్, అయిలయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ తల్లిపాలపై అవగాహన అవసరం

మిరుదొడ్డి(దుబ్బాక): గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక సూచించారు. మండల పరిధిలోని చెప్యాల అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల విశిష్టతపై అవగాహన కలిగించారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఏఎన్‌ఎం అనసూయ, ఆశా కార్యకర్తలు నిర్మల, జ్యోతి పాల్గొన్నారు.

◆ గద్దర్ స్మృతి వనం నిర్మించాలి

సిద్దిపేటకమాన్: గద్దర్ స్మృతి వనం నిర్మించాలని పలు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు 6న హైదరాబాద్‌లో జరగనున్న గద్దర్ రెండో వర్ధంతికి చెందిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో గద్దర్ స్మారకంగా స్మృతివనాన్ని నిర్మిస్తామని సీఎం హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా నిర్మించలేదన్నారు. శ్రీహరి, రంగాచారి, తిరుపతి రెడ్డి, లక్ష్మణ్, సత్తయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

◆ ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

మిరుదొడ్డి(దుబ్బాక): ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందాలని ఆయిల్ ఫెడ్ జిల్లా మేనేజర్ భాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని రుద్రారంలో పాప ఆంజనేయులు సాగుచేసిన ఆయిల్ పామ్ తోటలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాగు విధానం, నీటి యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం, కాత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఏఓ సత్య అన్వేష్, ప్లాంట్ మానిటరింగ్ అధికారి రాములు, ఏఈఓ సమాజత, ఎఫ్ఓ ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

◆ ధర్మవరం పాఠశాల తనిఖీ

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ ప్రవీణ్ బాబు అన్నారు. మండలంలోని ధర్మారం ప్రభుత్వ పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు సొంత డబ్బులతో విద్యా వాలంటీరిని నియమించడం అభినందనీయమన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. హెచ్‌ఎం జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ అనుమానితులపై ప్రత్యేక నిఘా

సిద్దిపేటఅర్బన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అనుమానితులపై నిఘా ఏర్పాటు చేసినట్టు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ చెప్పారు. అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామాన్ని సోమవారం సందర్శించి ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల రక్షణ, శాంతి భద్రతల విషయంలో పోలీసులకు ఉపకరించే సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వీపీఓ, కానిస్టేబుల్స్ ఉన్నారు.

◆ 19న సీపీఐ రాష్ట్ర మహాసభలు

బెజ్జంకి(సిద్దిపేట): హైదబాద్‌లో 19న జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలకు నాయకులు, కార్మికులు, కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ మండల కార్యదర్శి రూపేశ్ పిలుపునిచ్చారు. బెజ్జంకిలో సోమవారం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు సంగెం మధు, పరశురాములు, బాబు, మహేశ్, చరణ్, నర్సయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ నియామక పత్రాలు అందజేత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో పట్టణ పద్మశాలి యువజన కార్యవర్గం, పట్టణ మహిళ నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో టూటౌన్, త్రీటౌన్ సీఐలు ఉపేందర్, విద్యాసాగర్, పట్టణ అధ్యక్షుడు కాముని రాజేశం, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి సతీశ్ హాజరయ్యారు. అనంతరం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూతనంగా ఎన్నికైన యువజన సంఘం అధ్యక్షుడు బైరి మురళి, ప్రధాన కార్యదర్శి క్యాతం సాగర్ మాట్లాడుతూ పద్మశాలి సమాజ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నాయకులు అశోక్, శ్రీహరి, బాల్‌రాజు, రవితేజ, ఆంజనేయులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

◆ చైర్మన్ ఛాంబర్‌పై దాడి సరికాదు

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ ఛాంబర్‌లోకి బలవంతంగా చొచ్చుకొని పోయి సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టడాన్ని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మచ్చ వేణుగోపాల్‌రెడ్డి ఖండించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సిద్దిపేట అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి, సీఎం ప్రజల గుండెల్లో ఉండేలా చూడాలి కానీ బలవంతంగా ఫొటో పెట్టడం సరికాదన్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం చైర్మన్ ఛాంబర్‌లో సీఎం, పీఎం ఫొటోలు తప్పనిసరిగా పెట్టాలని ఏమీ లేదని చెప్పారు.

◆ తాళం వేసిన ఇంట్లో చోరీ

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. సోమవారం పోలీసులు వివరాలు తెలిపారు. గ్రామానికి చెందిన బచ్చల బాలలక్ష్మి ఆదివారం ఉదయం తన ఇంటికి తాళంవేసి కూరగాయాలు కోయాడానికి వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లో బీరువా కూడా తెరిచి ఉండడంతో అందులో ఉంచిన రూ.8 వేలు, పది తులాల వెండి ఆభరణాలు అపహరించారని గమనించి బాలలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజు తెలిపారు.

◆ ఏపీఎంగా పరశురాములు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ఏపీఎంగా బత్తిని పరశురాములు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన నర్సయ్య జగదేవ్‌పూర్ మండలానికి బదిలీపై వెళ్లారు. పరశురాములు చిన్నకోడూర్ మండల ఏపీఎంగా పని చేశారు.